చిలకలగూడ ఏసీపీగా బాధ్యతల స్వీకరణ


ఏసీపీ శశాంక్‌రెడ్డి

చిలకలగూడ: చిలకలగూడ ఏసీపీగా కే. శశాంక్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎల్లారెడ్డిగూడ తోపాటు పంజాగుట్ట డీఐగా, మారేడుపల్లి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించారు. సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా ఇక్కడికి రాగా ఇక్కడ పనిచేసిన ఏసీపీ జైపాల్‌రెడ్డి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శశాంక్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ ఠాణాలకు చెందిన ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

మర్యాదపూర్వక కలయిక


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

లాలాపేట: మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్. నరేష్, బోదాసు నరసింహ, సతీశ్, హరి తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్ 44 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజల ఆశీర్వాదం రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై ఉండాలని, అప్పుడే ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం వస్తుందని పేర్కొన్నారు.

క్రెడిట్ల కుదింపు నిర్ణయంపై ఓయూ ప్రొఫెసర్ల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీలో ద్వితీయ భాషలుగా కొనసాగుతున్న తెలుగు, హిందీ, సంస్కృతం తదితర సబ్జెక్టుల క్రెడిట్లను 20 నుంచి 12కు కుదింపు నిర్ణయంపై ఓయూ ప్రొఫెసర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఓయూలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, సంస్కృతం విభాగం ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా జరిగిన అధ్యాపకుల సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీసుకున్న క్రెడిట్ల కుదింపు నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. క్రెడిట్ల కుదింపును అమలు చేస్తే విద్యార్థులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్రెడిట్ల కుదింపు నిర్ణయంపై ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. సయ్యద్ తలత్ సుల్తానా సంస్కృతం విభాగం హెడ్ ప్రొ.విద్యానంద్ ఆర్యా, మాజీ హెడ్ ప్రొ.నీలకంఠ మహోదయ, హిందీ హెడ్ ప్రొ.మాయ దేవి, బీవోఎస్ ప్రొ.సంగీత వ్యాస్ పాల్గొన్నారు.

వివాహితతో అసభ్యకర ప్రవర్తన: యువకుడి అరెస్టు

ఖైరతాబాద్: వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడిని ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ నాగరాజు సమాచారం మేరకు... బంజారాహిల్స్‌లో నివాసముండే ఓ వివాహిత (29) మంగళవారం సాయంత్రం మింట్ కంపౌండ్‌లోని వీర హనుమాన్ దేవాలయానికి వచ్చింది. ఆమె భర్త కోసం పక్కనే ఉన్న లేఖా అపార్ట్‌మెంట్ ముందు వేచి చూస్తోంది. అదే సమయంలో ఖైరతాబాద్‌లో నివాసముండే షేక్ అబ్దుల్లా (22) ద్విచక్ర వాహనంపై అటుగా వెళ్తూ అక్కడ ఉన్న ఆ మహిళ వద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం ఖైరతాబాద్‌లో నివాసముంటూ సోఫాలను మరమ్మతులు చేసే షేక్ అబ్దుల్లాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు వివరించారు.

కేబీఆర్ పార్కులో నేలకూలిన చెట్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో బుధవారం రాత్రి కురిసిన వానకు వాక్‌వేలో భారీ చెట్లు నేలకూలాయి. పార్కు లోపల ఉన్న వాక్‌వేలో ఈ భారీ చెట్లు నేలకూలడంతో వాకర్లు ఇబ్బందులు పడ్డారు. వాకర్లు చెట్లు పడిపోయిన విషయాన్ని గుర్తించి అధికారులకు చెప్పడంతో దారికి అడ్డంగా పడిపోయిన చెట్లను పార్కు అధికారులు పక్కకు తప్పించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు


వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మేయర్ కార్తీకరెడ్డి

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని లక్ష్మీగణపతి ఆలయంలో బీజేపీ నాయకుడు బండ శివారెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సంవృద్ధి వర్షాలు, పాడిపంటలతో వ్యవసాయం కళకళలాడి గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆంజనేయుడిని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే తార్నాకలో చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహా అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్వయంగా ప్రజలకు అన్నం వడ్డించడంతో పాటు భక్తులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు బండ చంద్రారెడ్డి, స్టేట్ ఓబీసీ అధ్యక్షుడు గౌతంరావు, జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు యాదిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం. వీరన్న, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.


భక్తులతో కలిసి భోజనం చేస్తున్న కేంద్రమంత్రి

తుకారాంగేట్ పహాడీ హనుమాన్ ఆలయంలో..

అడ్డగుట్ట: తుకారాంగేట్ పహాడీ హనుమాన్ ఆలయంలో తెల్లవారుజాము నుంచే ఆంజనేయ స్వామి విగ్రహానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం, సింధూరం, ఆకుపూజ, వివిధ పుష్పాలతో అలంకరణలతో పాటు వడ మాల కూడా వేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి..


ప్రత్యేక అలంకరణలో
పహాడీ హనుమాన్ ఆంజనేయ స్వామి

హనుమాన్ ఆలయ ప్రాంగణంలో..

సనత్‌నగర్: హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో అర్చకులు ఉదయం అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ, హారతి దర్శనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, గోపాల్‌జోషితో పాటు ఆర్ రవికుమార్, సురభి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న తహసీల్దార్ భీమయ్య, సిబ్బంది


ఓయూలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అడ్డగుట్ట: సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతిని మారేడుపల్లి మండల కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బీమయ్య గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ రాజు నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గతంలో హైదరాబాద్‌లో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మోహన్, ఆర్ ఐలు సర్వేశ్, కృతిక, జూనియర్ అసిస్టెంట్ స్వజన, సురేష్, వంశీ, నవీన్, చిత్తయ్య పాల్గొ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట అంసా ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో విద్యార్థులు భాగ్యరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, కాంగ్రెస్ నాయకులు వలిగొండ నరసింహ, కరణ్, కాశీనాథ్, కృష్ణ, రమేశ్, సతీశ్, నవీన్, సురేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో వసతుల కల్పనకు కృషి చేయాలి


సమావేశంలో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: శ్మశాన వాటికలో వసతుల కల్పనకు కృషి చేయాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సూచించారు. శాంతినగర్‌లో సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటిక నూతన కమిటీ సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ నిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీను, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, అమర్, కమిటీ అధ్యక్షుడు రమేశ్, లక్ష్మీనారాయణ, మహేందర్, దేవానంద్, జగదీశ్, హనుమంతు, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమంజిల్ స్కూల్ భవనాన్ని సత్వరమే పూర్తిచేయాలి

పంజగుట్ట: జూన్‌లో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎర్రమంజిల్ పాఠశాల నూతన భవనాన్ని సత్వరమే పూర్తిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పేర్కొన్నారు. కొత్త పాఠశాల ప్రారంభం కాకముందే పాత పాఠశాల తరగతి గదులు కూలుస్తామంటే ఒప్పుకునేది లేదని ఆమె స్పష్టం చేశారు. సంవత్సరం గడుస్తున్నా ఇంకా పనులు పూర్తి చెయ్యకుండా పాత పాఠశాల కూల్చేస్తే ఇక్కడ చదివే సుమారు 350 మంది విద్యార్థుల పరిస్థితి ఏమిటని విజయారెడ్డి ప్రశ్నించారు. రాత్రిపగలు పనిచేసి పాఠశాల ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పాఠశాల నిర్మిస్తున్న భవనాన్ని పి.విజయారెడ్డి, జాయింట్ కలెక్టర్ ముకుంద్ రెడ్డి, ఆర్డీవో శ్రీరామ్, విద్యాశాఖ అధికారి శామ్యూల్, ఎమ్‌ఆర్‌ఓ నయీముద్దీన్ గురువారం సందర్శించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పనులు పూర్తయ్యే వరకు టెంపర్‌వెరీ షెడ్ వేసి పాఠశాల నడిపిద్దామా అనే ప్రతిపాదన తీసుకొచ్చారు. స్కూల్ భవనం నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌ను పనులు నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలని విజయారెడ్డి ఆదేశించారు.


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న విజయారెడ్డి, జాయింట్ కలెక్టర్, అధికారులు

'కేఏ పాల్ ప్రేయర్‌ను రద్దు చేయాలి '

పంజగుట్ట: గ్లోబల్ పీస్ ప్రేయర్ పేరిట ఈనెల 24న కేఏ పాల్ తలపెట్టిన ప్రేయర్‌ను రద్దు చేసి శాంతిభద్రతలను కాపాడాలని భారత క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్ బిషప్ భాస్కర్ ముల్కల కోరారు. ఖైరతాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. 24న క్రైస్తవులతో జింఖానా గ్రౌండ్స్‌లో ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు క్రిస్టియన్లను రెచ్చగొట్టేందుకు చేస్తున్న కుట్రే ఈ ప్రేయర్ అని ఆరోపించారు. గతంలో కూడా దళిత క్రైస్తవ యువకులకు, విద్యార్థులకు జాబ్ వీసాలు ఇప్పిస్తానని జింఖానా గ్రౌండ్స్‌లోనే పీస్ ప్రేయర్ పేరుతో మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. ఆ మీటింగ్‌కు ఎవరూ విదేశీ క్రైస్తవ మిషనరీలు రాలేదని, సభ అనంతరం ఒక్కరికీ వీసాలు ఇవ్వలేదన్నారు. ఈ మీటింగ్‌కు అనుమతి ఇవ్వద్దని ఇప్పటికే పోలీస్ కమిషనర్, డీజీపీ, ఉన్నతాధికారులందరికీ వినతి పత్రాలు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 19, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 65, గోకర కాయ 35, కీర 21, దోసకాయ 18, బీట్ రూట్ 19, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామ గడ్డ 33, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సోర కాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

రేపు వాహనాల వేలం

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 24న వాహనాలు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో జప్తు చేసిన వాహనాలు ఉన్నాయని ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పాల్గొనేవారు ధరావతు కింద రూ.15 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న అనంతరం మిగిలిన మొత్తాన్ని 18 శాతం జీఎస్‌టీతో కలిపి చెల్లించి వాహనం తీసుకెళ్లాలని తెలిపారు. వేలంలో పాల్గొని వాహనం దక్కించుకోని వారి డబ్బులు తిరిగి రావాని ఆయన పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం

గాంధీఆస్పత్రి : గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద గురువారం జరిగింది. చిలకలగూడ ఎస్‌ఐ సవిత తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న రాత్రి బ్లూకోట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా గాంధీ ఆస్పత్రి ప్రధాన గేట్ వద్ద ఓ మహిళ అపస్మారకస్థితిలో ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు మహిళను ఎమర్జెన్సీ వార్డులో చేర్పించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి ఏ.బీ క్యాబిన్ల మధ్యలో ఈనెల 21న రాత్రి సుమారు 40–45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కుడి చేతిపై 'శ్రీ అను' అని పచ్చబొట్టు రాసి ఉందని పోలీసులు తెలిపారు.

ఆలయాల్లో వసతుల కల్పనకు కృషి

రసూల్‌పురా: ఆలయాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. షాపర్స్‌లైన్ ఎంఈఎస్ క్వార్టర్స్‌లోని కాళీ దుర్గాదేవి ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో గురువారం నిర్వహించిన అభిషేకం, గణపతి పూజ, కుంకుమార్చన, దుర్గా హోమం, హారతి తీర్థప్రసాద వితరణ, అన్న ప్రసాద కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పీసీసీ సెక్రటరీ రాజేశ్‌యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ ఆర్. వివేకానంద, సెక్రటరీ ఉమా మహేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ రమేశ్, జాయింట్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్, ఎం.నగేశ్, క్రాంతి, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి


సమావేశంలో రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేయాలని రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో లాలాపేటలోని నఫీజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్లో తార్నాక, అడ్డగుట్ట, మెట్టుగూడ మున్సిపల్ డివిజన్ల నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. త్వరలో మున్సిపల్ డివిజన్ల వారీగా పాదయాత్ర చేపడతామని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సిద్ధేశ్వర్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మాజీ, అమర్‌నాథ్‌గౌడ్, గంటరాజు, కిశోర్ యాదవ్, శిల్పాచారి, గుంటి కృష్ణ, రమేశ్, హరి, పర్వేజ్, శేఖర్, శశాంక్, బెన్నా, నిస్సార్, బాబా అశోక్, సిద్ధు తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నానని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ, ఫాగింగ్ అధికారులు, సిబ్బందితో నామాలగుండులో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌కు ఒకరు లేదా ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉండడంతో ఫాగింగ్ ప్రక్రియ సరిగా జరగడం లేదని గుర్తించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల సిబ్బంది కలిసి రోజుకు ఒక డివిజన్‌లో ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారని తెలిపారు. దీంతో వారంతా సీతాఫల్‌మండి డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో గురువారం ఫాగింగ్ చేశారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ యూనస్, సిబ్బంది పాల్గొన్నారు.


ఫాగింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ హేమ

అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ కొరడా




అక్రమ భవనాలకు రంధ్రాలు చేస్తున్న దృశ్యం

చిలకలగూడ : అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. సీతాఫల్‌మండి, చిలకలగూడ తదితర ప్రాంతాల్లో అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుల ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు చిలకలగూడ ఠాణా పోలీసుల బందోబస్తు మధ్య గురువారం కూల్చివేతలు చేపట్టారు. చిలకలగూడ ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మిస్తున్న 3 అక్రమ కట్టడాలు, సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని మరో రెండు అక్రమ కట్టడాల పైఅంతస్తులను కూల్చివేశారు. 2 అంతస్తులకే అనుమతి తీసుకుని 4 నుంచి 5 ఫ్లోర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాక్ ఇంజినీర్ ప్రకాశ్, చైన్‌మెన్లు నాగయ్య, చంద్రశేఖర్, ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో పాటు చిలకలగూడ పోలీసులు పాల్గొన్నారు.

'సుందరకాండ–హనుమత్ సీతా దర్శనం'పై ప్రవచనం


ప్రవచనం చేస్తున్న రవికృష్ణ


హాజరైన కాలనీవాసులు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో 'సుందరకాండ–హనుమత్ సీతా దర్శనం'పై గురువారం సాయంత్రం ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తుర్లపాటి రవికృష్ణ సుందరకాండ వైభవాన్ని వివరించారు. సుందరకాండలో ఎదురయ్యే ప్రతి ఘటనను మనిషి తన జీవితానికి అన్వయం చేసుకుని ఎలా ఉండాలో నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బుచ్చిబాబు, జేఎస్‌టీ శాయి, శశికాంత్, లలిత, రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలను వ్యతిరేకించాలి

ప్రముఖ కవయిత్రి విమల

హిమాయత్‌నగర్: అందాల పోటీల్లో స్త్రీలను విలాస వస్తువుగా చూపిస్తున్నారని ప్రముఖ కవయిత్రి విమల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఎవరూ వ్యతిరేకించకపోవడం బాధాకరమన్నారు. గురువారం రాత్రి బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'అందాల పోటీలు–వ్యాపార సంస్కృతి' అంశంపై మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారి అధ్యక్షతన సామాజిక సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన విమల మాట్లాడుతూ... ఒకవైపు రైతులు, విద్యార్థులు, మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటే వాటిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల వ్యాపారంలో భాగమే ఈ అందాల పోటీలని విమర్శించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ... స్త్రీని అంగడి వస్తువుగా మారుస్తున్న వ్యాపార ప్రపంచంలో ఈ అందాల పోటీలు నిర్వహిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించాలన్నారు. అందాల పోటీలతో తెలంగాణ ప్రతిష్ఠ పెరగదు, దిగజారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో ప్రముఖ రచయిత దేశపతి శ్రీనివాస్, రచయిత్రి ఆర్.పద్మజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ కవయిత్రి విమల

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379